
సిగ్నళ్ల ఏర్పాటు అటకెక్కినట్టేనా..?




గతంలో ఏర్పాటు చేసి.. అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న సిగ్నళ్లు

- రూ.2.41 కోట్ల కేటాయింపు
- నేటికీ ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

నెల్లూరు(బారకాసు): నగరంలో అస్తవ్యస్తంగా మారిన ట్రాఫిక్‌ను గాడిన పెట్టేందుకు సంకల్పించిన సిగ్నళ్ల ఏర్పాటు ప్రక్రియ అడుగు ముందుకు పడటంలేదు. వాస్తవానికి ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేట్ సమీపం, ముత్తుకూరు గేట్ జంక్షన్, ట్రంక్‌రోడ్డు, వీఆర్సీ, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, కేవీఆర్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో గతంలో వీటిని ఏర్పాటు చేసినా, అవి మరమ్మతులకు గురయ్యాయి. వీటిని వినియోగంలోకి తీసుకురావాలనే ఆలోచన అధికారులకు నేటికీ రాలేదు. ఫలితంగా వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రమాదాలూ జరుగుతూనే ఉన్నాయి.

అతీగతీ లేని వైనం

నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటుకు నగరపాలక సంస్థ తాజాగా సంకల్పించింది. దీనికి గానూ బడ్జెట్లో రూ.2.41 కోట్లను కేటాయించారు. కౌన్సిల్ సమావేశాల్లో ఈ విషయమై పలువురు కార్పొరేటర్లు చర్చించారు. త్వరలో ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పడం.. ఆపై మిన్నకుండిపోవడం తరచూ జరుగుతోంది. ఈ క్రమంలో నిధులు ఏమయ్యాయో ఎవరికీ తెలియడంలేదు.

ఇదే విషయమై మంత్రి నారాయణ సైతం పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటుపై వినతిపత్రాన్ని పలువురు కార్పొరేటర్లు ఇటీవల అందజేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్పీటీ నెట్‌వర్క్ సంస్థకు నోటీసులిచ్చాం

సిగ్నళ్ల పనులు చేపట్టేందుకు సంబంధించిన కాంట్రాక్ట్‌ను ఎస్పీటీ నెట్‌వర్క్ సంస్థకు అప్పగించాం. వీటిని ఈ ఏడాది జూలైలోపు పూర్తి చేయాల్సి ఉన్నా, అది జరగలేదు. గడువు పూర్తవడంతో నోటీస్‌ను జారీ చేశాం. సెప్టెంబర్ వరకు గడువును కోరారు. అయినా మరోసారి నోటీస్‌ను ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నాం.

– రామ్మోహన్‌రావు, ఎస్ఈ, నగరపాలక సంస్థ

‘ఓటు బ్యాంకును కాపాడుకోవడమే వారి లక్ష్యం’

నెల్లూరు రూరల్: చొరబాటుదారుల ఓటు బ్యాంకును కాపాడుకోవడమే కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాల లక్ష్యమని బీజేపీ నేత చిలకా ప్రవీణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఓటు దోపిడీ అంటూ వారు చేస్తున్న ఆరోపణలు అసత్యమని చెప్పారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

నెల్లూరు(క్రైమ్): వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ ముస్లిం యూత్ సేవా సమితి నేతలు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా సత్కరించారు. సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఖాలిద్, సభ్యులు అబ్దుల్ అజీజ్, ఆషిక్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వ దినోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): ప్రపంచ మానవత్వ దినోత్సవాన్ని నగరంలోని పురమందిరంలో మంగళవారం నిర్వహించనున్నామని సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 11 మందిని సత్కరించనున్నామని చెప్పారు.

క్లుప్తంగా

జేవీవీ నగర కమిటీ మహాసభ



నెల్లూరు సిటీ: జన విజ్ఞాన వేదిక నగర కమిటీ మహాసభను నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విజయ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రఫీ, అధ్యక్ష, కార్యదర్శులుగా మోహన్‌రెడ్డి, కృష్ణ, కోశాధికారిగా కిశోర్, 20 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏసీఎస్సార్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్, జేవీవీ రాష్ట్ర నేత కాలేషా మాట్లాడారు. మాదకద్రవ్యాల రహిత సమాజ ఆవశ్యకతను వివరించారు. జేవీవీ కార్యదర్శి డాక్టర్ శ్రీనునాయక్, కోశాధికారి కృష్ణ, కళాకారులు పార్వతీశం, సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో పెరుగుతున్న నీటి మట్టం

పొదలకూరు: కండలేరులో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. సోమశిల ప్రాజెక్ట్ నుంచి ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా 8,100 క్యూసెక్కుల నీటిని జలాశయానికి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 27.85 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమశిలకు ఎగువ నుంచి 24 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో కండలేరుకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇటీవల 25 టీఎంసీలున్న కండలేరు జలాశయంలోకి సోమశిల నీటిని విడుదల చేయడంతో రెండు టీఎంసీలు పెరిగింది. జలాశయంలో 35 టీఎంసీలు నీరు నిల్వ ఉంటే కండలేరు ఎడమగట్టు కాలువకు గ్రావిటీ ద్వారా నీటిని విడుదల చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం రైతుల అవసరాల కోసం ఎడమగట్టు కాలువకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా విడుదల చేయడం భారీ ఖర్చుతో కూడుకున్న పని కావడంతో గ్రావిటీ ద్వారా సాగునీటిని కాలువకు అందిస్తే తెలుగుగంగ అధికారులకు ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం కండలేరు నుంచి సత్యసాయి కాలువకు 1,800, పిన్నేరుకు 20, లోలెవల్ స్లూయిజ్ ద్వారా 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల జరుగుతోంది. సోమశిల నుంచి వరద కాలువ ద్వారా నిత్యం 10 వేల క్యూసెక్కులు విడుదల చేయగలిగితే రోజుకు ఒక టీఎంసీ నీరు వచ్చి జలాశయంలో చేరుతుంది. అయితే సోమశిలకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే కండలేరుకు నీటి విడుదలను పెంచే అవకాశం ఉంటుంది. మొదటి బ్రాంచ్ కాలువ, ఎడమగట్టు కాలువ కింద కొందరు రైతులు ఎడగారు కింద వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చెప్పుకోదగిన స్థాయిలో నీటి అవసరాలు లేవని తెలుస్తోంది.

220 మందికి నేత్ర పరీక్షలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో 220 మంది పేదలకు నేత్ర పరీక్షలను చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆదివారం నిర్వహించారు. 60 మందికి కళ్లద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సీఈఓ గల్లా కృష్ణ మాట్లాడారు. ఆపరేషన్లు అవసరమైన వారికి వెంకటేశ్వర అరవింద నేత్రాలయ ఆధ్వర్యంలో త్వరలో ఉచితంగా నిర్వహించనున్నామని వెల్లడించారు. ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



మనుబోలు: మండలంలోని పిడూరు గ్రామం దళితవాడలో మాతమ్మ కలశ స్థాపన, నూతన విగ్రహ శిఖర ప్రతిష్ట కార్యక్రమాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి – సుప్రియ దంపతులు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నగరం వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన గౌస్‌బాషా పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి బయలుదేరగా కసుమూరు మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో గౌస్‌బాషా గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంలో గణేశ్ ఘాట్‌ను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సింగిల్ విండో పద్ధతిన అన్ని అనుమతులను అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో గణేశ్ ఉత్సవాలను సమైక్యంగా నిర్వహించేందుకు మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ గణేశ్ ఉత్సవ సమితి ఏర్పాటైందని, నెల్లూరు నుంచి బయ్యా వాసు ఉపాధ్యక్షుడిగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, గౌరవ సలహాదారులు సురేంద్రరెడ్డి, అధ్యక్షుడు కొండపల్లి శ్రీకాంత్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, మండ్ల ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్, ఫణిరాజు, మల్లికార్జున, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణుడికి పూజలు



నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని పొగాకు గోడౌన్ వద్ద కృష్ణాష్టమి వేడుకలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి – ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడికి పూజలు చేశారు. నగర కమిటీ అధ్యక్షుడు సురమౌళి, నిర్వాహకులు వెంకటరత్నం, నరసింహప్రసాద్, రఘు రామయ్య, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, సునీత, జయసుధ, సునీల్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న రామన్న

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశంలో నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం పోరాడే ఏకైక సంఘం డీవైఎఫ్ఐ అని రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు రామన్న, రమణ పేర్కొన్నారు. బంగ్లాతోట సెంటర్‌లోని రత్నం భవనంలో ఆదివారం నిర్వహించిన డీవైఎఫ్ఐ నెల్లూరు నగర మహాసభలకు ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడారు. డ్రగ్స్, మత్తు పదార్థాల నియంత్రణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జగదీష్, నరసింహ, ట్రెజరర్‌గా శేఖర్, సహాయ కార్యదర్శిగా సురేంద్ర, ఉపాధ్యక్షుడిగా రాజేష్ తదితరులు ఎన్నికయ్యారు.

వృద్ధులకు సత్కారం



నెల్లూరు(బృందావనం): వృద్ధులను ఆదరించి అక్కున చేర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు వస్త్రాలను ఆదివారం అందజేసి సత్కరించారు. అల్పాహారాన్ని అందజేశారు. జయప్రకాష్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి హనోక్, ఫొటోగ్రాఫర్ హరికృష్ణ, ఫొటోగ్రాఫర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాల్యాద్రి, మురళి, స్వర్ణసింగ్, ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య పనులు



నెల్లూరు(బారకాసు): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో పారిశుధ్య పనులను పక్కాగా చేపట్టాలని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అండర్ బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాలువల్లో పూడికతీత, ముురుగు తొలగింపు పనులను నిత్యం చేపట్టాలని ఆదేశించారు. బహిరంగ ప్రాంతాల్లో వ్యర్థాలేస్తే జరిమానాలను విధించాలని చెప్పారు. ఎంహెచ్ఓ కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నెల్లూరు (టౌన్): బిట్రగుంట రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్లో 2003లో పదో తరగతి చదివిన వారు నగరంలోని మినర్వా గ్రాండ్‌లో ఆదివారం కలుసుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకొని నాటి స్మృతులను నెమరేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో వ్యాస పూజ



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇస్కాన్ మందిరంలో శ్రీల ప్రభుపాద వ్యాస పూజను భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా వైష్ణవ భజనలు, కీర్తనలు, శ్రీల ప్రభుపాదులకు అభిషేకం తదితరాలను జరిపారు. మధ్యాహ్న హారతి, 56 వంటకాలతో నివేదన, పుష్పాంజలి, నందోత్సవాన్ని జరిపారు. మందిరాధ్యక్షుడు శుఖదేవస్వామి పర్యవేక్షించారు.

ఏపీఆర్ఎస్ఏ నెల్లూరు డివిజన్ యూనిట్ ఎన్నిక



నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నెల్లూరు డివిజన్ యూనిట్ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఇందుకూరుపేట తహసీల్దార్ గోపీకృష్ణ, కార్యదర్శిగా నెల్లూరు రూరల్ డీటీ నాసర్ ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా తోటపల్లిగూడూరు డీటీ శివయ్య, వైస్ ప్రెసిడెంట్ – 1, 2, 3గా బుచ్చిరెడ్డిపాళెం డీటీ భాగ్యలక్ష్మి, ఇందుకూరుపేట మండల సీనియర్ సహాయకుడు కొండలరావు, వెంకటాచలం మండల డీటీ విజయ్, జాయింట్ సెక్రటరీ – 1, 2, 3గా మల్లికార్జునరావు, పవన్, శ్రీనాథ్, కోశాధికారిగా జమీర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా మురళి, హరిబాబు వ్యవహరించారు.

23, 24న క్రీడా పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వలంటీర్లు

నెల్లూరు (టౌన్): గ్రామీణ క్రీడాకారులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను బుచ్చిరెడ్డిపాళెంలోని జెడ్పీ హైస్కూల్లో ఇషా ఫౌండేషన్ సౌజన్యంతో ఈ నెల 23, 24న నిర్వహించనున్నామని సంస్థ వలంటీర్ మాధవ్ పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను బీవీనగర్‌లోని సంఘమిత్ర స్కూల్లో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహించనున్నామని, మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు పురస్కారాలను అందజేయనున్నామని తెలిపారు. వివరాలకు 94405 35032, 81796 71988 నంబర్లను సంప్రదించాలని సూచించారు. వలంటీర్లు మహేష్, గిరి పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి నిత్యావసరాలను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, నేతలు స్వర్ణ రమేష్‌బాబు, బెజవాడ సునీల్‌రెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, గోపాల్‌రెడ్డి, జయదేవ్, చంద్రమౌళి, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనహిత – వాత్సల్యకు చేయూత



నెల్లూరు(బృందావనం): వనంతోపు సమీపంలోని జనహిత, వాత్సల్య నిరాదరణ బాలల, వృద్ధాశ్రమానికి నిత్యావసర సామగ్రిని వైద్యా, ఆరోగ్య శాఖ జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న దంపతులు ఆదివారం అందజేశారు. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, ఆశ్రమ కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివరావు, మానవసేవే మాధవసేవ టీమ్ నిర్వాహకులు అరవ పరిమళ, పుల్లారెడ్డి, కల్పం శ్రీనివాసులు, ఖాదర్‌మస్తాన్, జయశ్రీ, జనహిత, వాత్సల్య నిర్వాహకులు మల్లికార్జున, గిరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: కొత్తవెల్లంటిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం నిర్వహించారు. టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు వస్త్రాల పంపిణీ



నెల్లూరు(బృందావనం): వైఎస్సార్‌నగర్‌లోని రవిచంద్ర గిరిజన కాలనీలో నిరుపేదలకు వస్త్రాలను ఆదివారం పంపిణీ చేశారు. జెడ్పీ వాకర్స్ సంఘ సభ్యులు ప్రసాద్, హర్షవర్ధిని దంపతులు తమ మనవరాలు జన్మదినాన్ని పురస్కరించుకొని వీటిని అందజేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి, రూడ్స్ స్వచ్ఛంద సంస్థ రసూల్, చెంచయ్య, ఎస్తేరు రాణి, ఖాజామస్తాన్, రమణయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, మెట్టు సుజన తదితరులు పాల్గొన్నారు.